క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

దేవరకొండ: పట్టణంతో పాటు మండల పరిధిలోని కొండభీమనపల్లి, మైనంపల్లి ఫీడర్ల లో బుధవారం ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు దేవరకొండ విద్యుత్ శాఖ ఏడీఈ సైదులు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా కరెంట్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

రైతుల భూ సమస్యలు పరిష్కరించాలి



మాడ్గులపల్లి తహసీల్దార్ కార్యాలయంలో మాట్లాడుతున్న ఆర్డీఓ చెన్నయ్య

మిర్యాలగూడ: రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను అధికారులు సత్వరమే పరిష్కరించాలని ఆర్డీఓ చెన్నయ్య అధికారులను ఆదేశించారు. మంగళవారం మాడ్గులపల్లి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు విచారణ జరిపి సమస్య పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎప్పటికప్పుడు లబ్ధిదారులకు అందేలా చూడాలన్నారు. అధికారులు విధుల పట్ల అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు. సమావేశంలో తహసీల్దార్ అర్చన, ఆర్‌ఐ అక్తర్‌అలీ, జూనియర్ అసిస్టెంట్ రేణుక తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి హామీ'ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర

చింతపల్లి: కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్రలు పన్నుతుందని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కలకొండ కాంతయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సంఘం మండల సమితి సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ఉపాధి హామీ పథకానికి తక్కువ నిధులు కేటాయించి, ఈ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తుందన్నారు. గ్రామాల్లో ఉపాధి హామీ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వ్యకాస నల్లగొండ జిల్లా కార్యదర్శి బి. నర్సింహ, ఉపాధ్యక్షుడు వెంగలయ్య, సీపీఐ మండల కార్యదర్శి పోలె వెంకటయ్య, ఇద్ది రాములు, లాలయ్య, కృష్ణయ్య, బుచ్చయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు



రుద్రారంలో మాట్లాడుతున్న సినీ నటి కవిత

మిర్యాలగూడ టౌన్: కేంద్రం అమలు చేస్తున్న పలు పథకాలకు తెలంగాణలో ఇక్కడి ప్రభుత్వం కొత్త కొత్త పేర్లు పెట్టి తామే ఆ పథకాలను తీసుకొచ్చినట్లు తప్పుడు ప్రచారం చేస్తుందని బీజేపీ మిర్యాలగూడ అసెంబ్లీ నియోజకవర్గ పాలక్, సినీ నటి కవిత, నియోజకవర్గ ప్రభారీ గోగిరెడ్డి అచ్చిరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని రుద్రారం, హత్యాతండాల్లో 'ప్రజా గోస–బీజేపీ భరోసా' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రం రాష్ట్రంలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణానికి కేంద్రం నుంచి నిధులు వస్తున్నప్పటికీ కేసీఆర్ ప్రభుత్వం వాటిని పూర్తి చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే కేంద్రం నుంచి కేసీఆర్ ఎన్ని నిధులు తీసుకువచ్చారో.. ఆ నిధులు ఏమి చేశారో బయటపడతాయని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కమిటీ సభ్యుడు సాధినేని శ్రీనివాస్‌రావు, మండల పార్టీ అధ్యక్షుడు పెలి విద్యాసాగర్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు కొండేటి సరిత తదితరులున్నారు.

సేవాలాల్ జయంతిని జయప్రదం చేయాలి

మిర్యాలగూడ: పట్టణంలో ఈ నెల 21న నిర్వహించే సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. ఉత్సవాల నిర్వహణపై మంగళవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ చెన్నయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా సేవాలాల్ జయంతి ఉత్సవాలు నిర్వహిస్తుందన్నారు. కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ తిప్పన విజయసింహారెడ్డి, మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ధనావత్ చిట్టిబాబునాయక్ పాల్గొన్నారు.

'పుల్వామా' అమరులకు ఘన నివాళి



హాలియాలో అమరవీరులకు నివాళులర్పిస్తున్న ఎస్‌ఐ క్రాంతికుమార్, ఉపాధ్యాయులు



మిర్యాలగూడ టౌన్: బాపూజీనగర్ సర్కిల్‌లో నివాళులర్పిస్తున్న యువకులు, విద్యార్థులు



కొండమల్లేపల్లి: అమర జవాన్లకు నివాళులర్పిస్తున్న విద్యార్థులు, ఏబీవీపీ నేతలు



మిర్యాలగూడలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్‌ఎస్‌ఎస్, హిందూవాహిని కార్యకర్తలు

హాలియా: జమ్మూ కశ్మీర్‌లోని పుల్వామాలో నాలుగేళ్ల క్రితం ఉగ్రవాదుల దాడిలో అమరులైన సీఆర్‌పీఎఫ్ జవాన్ల చిత్రపటాలకు మంగళవారం పట్టణంలోని హాలియా పబ్లిక్ స్కూల్‌లో ఘనంగా నివాళులర్పించారు. అమర జవాన్ల ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ క్రాంతికుమార్, హాలియా పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ మేడిపల్లి మోహన్‌రావు, డైరెక్టర్ తడకమళ్ల శ్రీనివాస్, ప్రిన్సిపాల్ గోపి నాయర్, ఉపాధ్యాయుడు యడవెల్లి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడలో..

మిర్యాలగూడ టౌన్: పుల్వామా ఉగ్రదాడిలో అమరులైన జవాన్లకు పట్టణంలోని నీరజ హైస్కూల్ విద్యార్థులు, యువకులు బాపూజీనగర్ సర్కిల్ వద్ద నివాళులర్పించారు. అనంతరం రోడ్డుపై నిల్చొని జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రాజు, యువకులు వద్ది మల్లేష్, ఐలా వెంకన్న, పిన్నబోయిన శ్రీనివాస్ యాదవ్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ర్యాలీ..

పుల్వామా ఉగ్రదాడిలో అమరులైన జవాన్ల త్యాగాలను స్మరించుకుంటూ మంగళవారం రాత్రి ఆర్‌ఎస్‌ఎస్, హిందూవాహిని ఆధ్వర్యంలో మిర్యాలగూడ పట్టణంలో భారీ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పట్టెం అంజి, కరుణాకర్, ప్రసాద్, గుడూరు శ్రీనివాస్‌రావు, పట్టెం రాజు, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొండమల్లేపల్లిలో..

కొండమల్లేపల్లి: మండల కేంద్రంలోని కళాశాలలు, పాఠశాలల్లో మంగళవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో పుల్వామా ఉగ్రదాడిలో అమరులైన జవాన్లకు నివాళులర్పించారు. వారి త్యాగాలను దేశం ఎప్పటికీ మరువదని పలువురు నాయకులు అన్నారు. కార్యక్రమంలో కొత్త అఖిల్, ఆకాశ్, గోపి, మానస, మహేశ్, గోపి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్న సర్పంచ్



ఇసుక ట్రాక్టర్ల ముందు ధర్నా చేస్తున్న తాటికోల్ గ్రామ సర్పంచ్ ధనలక్ష్మి

దేవరకొండ: మండల పరిధిలోని తాటికోల్ వాగు నుంచి ఇసుక అక్రమ రవాణాకు అధికారులు అడ్డుకట్ట వేయాలని గ్రామ సర్పంచ్ జూలూరి ధనలక్ష్మి డిమాండ్ చేశారు. మంగళవారం తాటికోల్ వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారం తెలుసుకున్న సర్పంచ్ వాగు శివారులోని గార్లకుంట వద్ద ఇసుకను తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను అడ్డుకొని దేవరకొండ పోలీసులకు సమాచారం అందించారు. గ్రామానికి చెందిన పలువురితో కలిసి సర్పంచ్ ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ల ముందు ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నిబంధనలను అతిక్రమించి ఇసుకను అక్రమంగా తరలిస్తే ఊరుకునేది లేదని పేర్కొన్నారు. ఆమె వెంట అంజయ్యగౌడ్, ఎరుకలి అశోక్‌గౌడ్, సైదులు, మధు, శివ తదితరులున్నారు.

వైభవంగా కల్యాణోత్సవం



కుందూరు జైవీర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఆలయ పూజారి

హాలియా: మండలంలోని పులిమామిడి గ్రామంలో గల గోవిందమాంబ సమేత శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయంలో స్వామివారి కల్యాణోత్సవం మంగళవారం కనుల పండవగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు కుందూరు జైవీర్ రెడ్డి కల్యాణోత్సవంలో పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు జైవీర్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కాకునూరి నారాయణగౌడ్, మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, వైస్ ఎంపీపీ మాలే అరుణ, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గౌనీ రాజారమేష్‌యాదవ్, కుందూరు రాజేందర్‌రెడ్డి, పగడాల నాగరాజు, బ్రహ్మాచారి, మాలె జానిరెడ్డి పాల్గొన్నారు.

24గంటల విద్యుత్ ఇవ్వాలని ధర్నా





మిర్యాలగూడ విద్యుత్ కార్యాలయం ఎదుట ధర్నాచేస్తున్న బీఎల్‌ఆర్, కాంగ్రెస్ నాయకులు, రైతులు

మిర్యాలగూడ: వ్యవసాయానికి 24గంటల విద్యుత్ అందించాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బత్తుల లక్ష్మారెడ్డి(బీఎల్‌ఆర్) ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు రైతులతో కలిసి మంగళవారం పట్టణంలోని విద్యుత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎల్‌ఆర్ మాట్లాడుతూ.. అప్రకటిత విద్యుత్ కోతలతో పంటలు ఎండిపోయే పరిస్థితి దాపురించిందన్నారు. వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ ఇస్తామని చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వం.. కేవలం రాత్రి సమయంలో 11గంటల తర్వాత కొన్ని గంటలు మాత్రమే కరెంట్ ఇస్తున్నారని ఆరోపించారు. నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయకపోతే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అనంతరం కార్యాలయంలోని విద్యుత్ డీఈకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే బీఆర్‌ఎస్ లక్ష్యం

- ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి



హాలియా: మాధారిగూడెంలో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి

హాలియా: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. అనుముల మండలంలోని మధారిగూడెం గ్రామపంచాయతీలో ఎమ్మెల్సీ నిధులు రూ.17.50లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు, అనుముల, తిరుమలగిరి(సాగర్) మండలాల ఎంపీపీలు పేర్ల సుమతి, ఆంగోతు భగవాన్‌నాయక్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు మన్నెం రంజిత్‌యాదవ్, సర్పంచ్ కుందారపు సైదులు, మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు రావుల చిన భిక్షంయాదవ్, ఎంపీటీసీల ఫోరల జిల్లా అధ్యక్షుడు రావుల రాంబాబు, పెద్దవూర సర్పంచ్ నడ్డి లింగయ్యయాదవ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పోశం శ్రీనివాస్‌గౌడ్, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ మున్నా తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీడీ కిట్ల పంపిణీ

హాలియా పట్టణంలోని పీహెచ్‌సీలో రోగులకు నాన్ కమ్యూనబుల్ డిసీజెస్(ఎన్‌సీడీ) కిట్లను మంగళవారం అనుముల మండల ఎంపీపీ పేర్ల సుమతితో కలిసి ఎమ్మెల్సీ కోటిరెడ్డి రోగులకు పంపిణీ చేశారు. అనంతరం ఐసీడీఎస్ అనుముల ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ కోటిరెడ్డి, ఎంపీపీ సుమతి పాల్గొని దివ్యాంగులకు ట్రై సైకిళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీడీపీఓ పద్మావతి, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు రావుల చిన భిక్షం, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు రావుల రాంబాబుయాదవ్, కౌన్సిలర్ వెంకటయ్య, మైనార్టీ జిల్లా నాయకులు అబ్దుల్ హలీం, మాతంగి కాశయ్య, షేక్ మక్బూల్, అస్గర్, జహీర్, జలీల్ పాషా, సర్పంచ్‌లు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు తదితరులు ఉన్నారు.

రోడ్డుకు అడ్డంగా గోడ నిర్మాణం

- మున్సిపల్ అధికారులకు సమాచారం ఇచ్చిన స్థానికులు
- స్పందించని అధికారులు



కృష్ణమానస కాలనీలో రోడ్డుపై నిర్మించిన గోడ

మిర్యాలగూడ అర్బన్: అది గ్రేటర్ కమ్యూనిటీ వెంచర్ కాదు. డీటీసీపీ లేఅవుట్ పర్మిషన్ అసలే లేదు. అక్కడ అన్ని వీధుల మాదిరిగానే మున్సిపల్ నిధులతో రోడ్లు, తాగునీటి పైపులైన్, వీధి లైట్లు వేశారు. అన్ని వసతులు కల్పించాక రోడ్డుపై రాత్రికి రాత్రి గోడను కట్టారు. వివరాలు.. మిర్యాలగూడ పట్టణంలోని కృష్ణమానస కాలనీలో నిత్యం రాకపోకలు సాగించే రోడ్డుకు అడ్డంగా పక్కనే అనధికారికంగా వెలసిన వెంచర్ నిర్వాహకులు సోమవారం రాత్రి గోడను కట్టారు. గోడను నిర్మించే సమయంలో మున్సిపల్ కమిషనర్‌కు సమాచారం ఇచ్చినా పట్టించుకోలేదని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ పరిధిలోని సీసీ రోడ్డుపై అడ్డంగా గోడను కట్టడం ఎంత వరకు సమంజసమని కాలనీవాసులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ రవీందర్‌సాగర్‌ను వివరణ కోరగా.. రోడ్డుపై గోడను నిర్మించిన విషయం టౌన్ ప్లానింగ్ అధికారులకు చెప్పానని, వారు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

గోడను తొలగించాలి: మహేష్, కాలనీవాసి

ప్రతి రోజు రాకపోకలు సాగించే సీసీ రోడ్డుపై గోడను నిర్మించారు. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి రోడ్డుపై నిర్మించిన గోడను తొలగించి కాలనీవాసులకు ఇబ్బంది లేకుండా చేయాలి.

అభివృద్ధిని చూసే బీఆర్‌ఎస్‌లో చేరికలు

- మిర్యాలగూడ ఎమ్మెల్యే భాస్కర్‌రావు



కండువాలు కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే భాస్కర్‌రావు

మిర్యాలగూడ: కేసీఆర్ ప్రవేశపెడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసే ఇతర పార్టీల నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని ఎమ్మెల్యే భాస్కర్‌రావు అన్నారు. మంగళవారం వేములపల్లి మండలంలోని కామేపల్లి గ్రామానికి చెందిన సుమారు 150మంది పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో వేములపల్లి మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు నామిరెడ్డి కరుణాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ అమరావతి, సైదులు, ఇరుగు వెంకటయ్య, పేరాల కృపాకర్‌రావు, చిర్ర మల్లయ్యయాదవ్ పాల్గొన్నారు.

విజేతలను అభినందించిన ఎమ్మెల్యే

నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో మిర్యాలగూడ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు బి. రాజేష్, పి. హర్షిత్, కె. మహిపాల్, సుశాంత్ పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచారు. వీరిని మంగళవారం ఎమ్మెల్యే భాస్కర్‌రావు క్యాంపు కార్యాలయంలో అభినందించారు.

బీమా చెక్కు అందజేత..

వేములపల్లి మండలం లక్ష్మీదేవిగూడేనికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త ముత్యాల శంకర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. పార్టీ తరఫున మంజూరైన రూ.2లక్షల ప్రమాద బీమా చెక్కును ఎమ్మెల్యే భాస్కర్‌రావు తన క్యాంపు కార్యాలయంలో మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు.

రోగులకు మందులు పంపిణీ

బీపీ, షుగర్ రోగులకు పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు మందులు పంపిణీ చేశారు. ఎన్‌సీడీ మందుల కిట్లను పీహెచ్‌సీల వారీగా రోగుల ఇంటికి వెళ్లి అందించాలని సూచించారు.

మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట

- దేవరకొండ ఎమ్మెల్యే రవీంద్రకుమార్



కొండమల్లేపల్లి: అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్

కొండమల్లేపల్లి: గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని దేవరకొండ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని కొత్తబావి గ్రామంలో మన ఊరు–మన ప్రభుత్వం–మన పథకాలు కార్యక్రమంలో భాగంగా రూ.25లక్షలతో చేపడుతున్న అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు కుంభం శ్రీనివాస్‌గౌడ్, పస్నూరి యుగేంధర్‌రెడ్డి, రమావత్ దస్రూనాయక్, మేకల శ్రీనివాస్‌యాదవ్, సర్పంచ్ జబ్బు యాదయ్య, ఎంపీటీసీ రాణిరాజు, గంధం సురేస్, ఉప సర్పంచ్ చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

మందుల కిట్ల పంపిణీ

దేవరకొండ: పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే రవీంద్రకుమార్ డయాబెటిస్, కేన్సర్, బీపీ రోగులకు ప్రభుత్వం అందిస్తున్న మందుల కిట్లను పంపిణీ చేసి మాట్లాడారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం ప్రతి నెలా మందులు పంపిణీ చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కృష్ణకుమారి, లింగం, వడ్త్య బాలు, బొడ్డుపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా కబడ్డీ పోటీలు ప్రారంభం



కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భగత్

పెద్దవూర: దున్న ఇద్దాస్ ఆరాధన మహోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని చింతపల్లిలో నిర్వహిస్తున్న ఆలిండియా మహిళల కబడ్డీ పోటీలు మంగళవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల భగత్, పెద్దవూర జెడ్పీటీసీ అబ్బిడి కృష్ణారెడ్డి, స్థానిక సర్పంచ్ ప్రభావతితో కలిసి ప్రారంభించారు. ఈ పోటీల్లో దేశంలోని 16 రాష్ట్రాల నుంచి జట్లు పాల్గొంటున్నాయి. ఈ నెల 18వ తేదీ వరకు ఈ పోటీలు జరుగనున్నట్లు టోర్నమెంట్ కమిటీ చైర్మన్ ఎస్‌కే అబ్బాస్ తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కర్ణ బ్రహ్మానందరెడ్డి, వాసుదేవుల సత్యనారాయణరెడ్డి, పెద్దవూర పీఏసీఎస్ చైర్మన్ గుంటుక వెంకట్‌రెడ్డి, జటావత్ రవినాయక్, సుంకిరెడ్డి వెంకట్‌రెడ్డి, శేఖర్, సైదులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పోస్టర్ ఆవిష్కరణ

గుర్రంపోడు: మండలంలోని మొసంగి గ్రామంలో ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు జరిగే భక్త మార్కండేయస్వామి జాతరకు సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం మండల కేంద్రంలో మాజీ జెడ్పీటీసీ గాలి రవికుమార్ ఆవిష్కరించారు. ఈ జాతర సందర్భంగా రాష్ట్రస్థాయి కబడ్డీ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు రావులపాటి భాస్కర్, మొసంగి సర్పంచ్ ఎన్నమల్ల కృష్ణప్రసాద్, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు గుండెబోయిన కిరణ్, ఎరుకల రామలింగం, ఆడెపు లింగయ్య, సుభాని తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

చింతపల్లి: మండలంలోని నెల్వలపల్లి గ్రామంలో మల్లికార్జునస్వామి జాతర సందర్భంగా నిర్వహిస్తున్న జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను మంగళవారం సర్పంచ్ గున్‌రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు బూర్గు ధనమ్మ, ఉప సర్పంచ్ పాలగోని శారద, వార్డు సభ్యులు, ఆర్గనైజర్లు పాల్గొన్నారు.

విద్యాసంస్థలకు సెలవు ప్రకటించాలి

కొండమల్లేపల్లి: సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలకు సెలవు ప్రకటించాలని కొండమల్లేపల్లి బంజారా సంఘం నాయకులు మంగళవారం ఆయా విద్యాసంస్థలకు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో రమావత్ సేవానాయక్, ప్రసాద్‌నాయక్, బన్నీ, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం నూతన కమిటీ ఎన్నిక

నాగార్జునసాగర్: నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని పైలాన్‌కాలనీ పద్మశాలి సంఘం అధ్యక్షుడిగా పోశం నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా పున్న సత్యనారాయణ ఎన్నికయ్యారు. మంగళవారం పైలాన్‌కాలనీలో సంఘం సభ్యులు సమావేశమై నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా గంజి వెంకటేశ్వర్లు, కోశాధికారిగా చెరుపల్లి నరేష్, ముఖ్య సలహాదారులుగా పున్న భిక్షమయ్య, అనుముల శ్రీధర్, ఉపాధ్యక్షులుగా నక్క వెంకటేశ్వర్లు, కర్నాటి శ్రీదేవి, సహాయ కార్యదర్శులుగా గంజి శ్రీకాంత్, గడ్డం లావణ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా గడ్డం అనిల్‌కుమార్, నక్క రమేశ్, అధికార ప్రతినిధిగా కుక్కడాల మల్లికార్జున్, కార్యవర్గ సభ్యులుగా గడ్డం నాగేంద్రబాబు, కొంపెల్లి వెంకటేశ్వర్లు, నక్క దీపక్, గుర్రం హరీష్, సీహెచ్ యోగానంద్ ఎన్నికయ్యారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

మిర్యాలగూడ అర్బన్: లైట్ మోటార్ డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ మిర్యాలగూడ పట్టణ నూతన కార్యవర్గాన్ని మంగళవారం పట్టణంలోని ఎన్‌ఎస్‌పీ క్యాంపు అడ్డా వద్ద ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా పోశం శ్రీను, అధ్యక్షుడిగా చల్లమల్ల విజయ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా పాదిళ్ల గంగాధర్, ప్రధాన కార్యదర్శిగా బి. కిరణ్, కోశాధికారిగా ఎస్‌కే. హబీబ్, కమిటీ సభ్యులుగా రియాజ్, నయీమ్, సైదులును ఎన్నుకున్నారు.

ఆర్థికసాయం అందజేత

నిడమనూరు: మండలంలోని వెనిగండ్ల గ్రామానికి చెందిన గాదె కృష్ణయ్య కుమారుడు గాదె హేమంత్ తలసేమియా వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ విషయం తెలుసుకుని ఏకే ఫౌండేషన్ చైర్మన్ కట్టెబోయిన అనిల్ కుమార్ మంగళవారం వైద్య ఖర్చుల నిమిత్తం హేమంత్‌కు రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మహేష్, శంకర్, భిక్షంయాదవ్, కళ్యాణ్, ప్రసాద్ పాల్గొన్నారు.

గోడ కూల్చివేత అడ్డగింత

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ పట్టణంలోని నల్లగొండ రోడ్డులో గల ఉత్తమ్ చికెన్ సెంటర్ సమీపంలో గల గోడను రోడ్డు విస్తరణలో భాగంగా మంగళవారం మున్సిపాలిటీ వారు కూల్చివేస్తుండగా కొంతమంది ముస్లింలు అడ్డుకున్నారు. దీంతో చేసేదేమీ లేక మున్సిపాలిటీ సిబ్బంది అక్కడి నుంచి వెనుదిరిగి వెళ్లారు.

కంటి వెలుగు శిబిరం ప్రారంభం

హాలియా: అనుముల మండలంలోని కొత్తపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ఎంపీపీ పేర్ల సుమతి మంగళవారం ప్రారంభించారు. ఈ శిబిరంలో వైద్యులు పలువురికి కంటి పరీక్షలు చేసి ఉచితంగా కళ్లద్దాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బూడిద స్వాతి, ఎంపీటీసీ ఉర్లగొండ వెంకటయ్య, నాయకులు, డాక్టర్లు, ఆశ వర్కర్లు ఉన్నారు.

ప్రజల వద్దకే ఆర్టీసీ సేవలు

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో 'ప్రజల వద్దకే ఆర్టీసీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మిర్యాలగూడ ఆర్టీసీ బస్టాండ్ స్టేషన్ మేనేజర్ భిక్షమయ్య మాట్లాడుతూ.. పట్టణంలోని రైల్వే ట్రాక్, ఈదులగూడెం చౌరస్తా, రామచంద్రాగూడెం నుంచి బస్టాండ్ వరకు కేవలం రూ.10 చార్జీ తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది రేవతి, నాగరాజు, లక్ష్మి తదితరులున్నారు.

తాంద్ర కుమార్ వర్ధంతి

మిర్యాలగూడ అర్బన్: ఎంసీపీఐ(యూ) నాయకుడు దివంగత తాంద్ర కుమార్ ప్రథమ వర్ధంతిని మిర్యాలగూడ మండలం యాద్గార్‌పల్లి గ్రామంలో మంగళవారం పార్టీ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా తాంద్ర కుమార్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వస్కుల సైదమ్మ, నాయకులు చంద్రకళ, కాశీ, జ్యోతి తదితరులున్నారు.

సైబర్ మోసాలతో అప్రమత్తంగా ఉండాలి

కొండమల్లేపల్లి: ప్రతిఒక్కరూ సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కొండమల్లేపల్లి ఎస్‌బీఐ బ్రాంచ్ డిప్యూటీ మేనేజర్ రామారావు అన్నారు. ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలోని శ్రీక్రాంతి జూనియర్ కళాశాలలో విద్య స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అశోక్, ఏఓ ఎర్రమద గోవర్ధన్‌రెడ్డి, సీహెచ్. శేఖర్, గిరిఅంకులమ్మ తదితరులు పాల్గొన్నారు.

పరిమితికి మించి ఎక్కించొద్దు

పెద్దవూర: ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని పెద్దవూర ఎస్‌ఐ పచ్చిపాల పరమేశ్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో ఆటో డ్రైవర్లు, యజమానులకు ట్రాఫిక్ నిబంధనలపై ఎస్‌ఐ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆటోలను రోడ్డు పక్కన ఇష్టానుసారంగా పార్కింగ్ చేస్తుండడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వాహనాలకు సంబంధించిన ఆర్‌సీ, ఇన్సూరెన్స్, లైసెన్స్ తప్పకుండా ప్రతి డ్రైవర్ వద్ద ఉండాలన్నారు.

ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుంటాం

హాలియా: మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నంబర్ 286లో గల మూడెకరాల 20 గుంటల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుంటామని తహసీల్దార్ మంగ తెలిపారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని అనన్య వెంచర్‌లో ఉన్న భూమిని మున్సిపల్ చైర్‌పర్సన్ వెంపటి పార్వతమ్మశంకరయ్య, కమిషనర్ వీరారెడ్డితో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 286 సర్వే నంబర్‌లో ఉన్న ప్రభుత్వ భూమిని వెంచర్ నిర్వాహకులు ఆక్రమించారని ఇబ్రహీంపేట గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త లింగాల ప్రభాకర్ ఇటీవల అధికారులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టామని తెలిపారు. ప్రభుత్వ భూమి ఉందని తేలితే హద్దురాళ్లు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ, సర్వేయర్, రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.

గిరిజన సంఘం సహాయ కార్యదర్శిగా శ్రీనునాయక్

మిర్యాలగూడ: గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శిగా దామరచర్ల మండలం మంగల్‌దుబ్బతండాకు చెందిన ధీరావత్ శ్రీనునాయక్ ఎన్నికయ్యారు. ఈ మేరకు మంగళవారం శ్రీనునాయక్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో పోడు రైతులకు ప్రభుత్వం పట్టాలు అందించాలని, లేదంటే గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఉద్యమిస్తామన్నారు. ఎన్నికల సమయంలో ప్రభుత్వం గిరిజనులకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలన్నారు.

కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

హాలియా: మున్సిపాలిటీలో సీసీ రోడ్లు, డ్రెయినేజీ కాల్వల నిర్మాణ కాంట్రాక్టు దక్కించుకుని పనులు ప్రారంభించని కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వర్ర వెంకట్‌రెడ్డి మంగళవారం మున్సిపల్ కమిషనర్ వీరారెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రెయినేజీలు, సీసీ రోడ్ల నిర్మాణానికి స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ నిధులు రూ.4.5 కోట్లు మంజూరయ్యాయన్నారు. ఈ పనులకు సంబంధించి టెండర్లు పూర్తయి 6 నెలలు కావస్తున్నా కాంట్రాక్ట్ దక్కించుకున్న కాంట్రాక్టర్ ఇప్పటి వరకు పనులు ప్రారంభించలేదని పేర్కొన్నారు. పనులు వెంటనే ప్రారంభించేలా చూడాలని లేదంటే సదరు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో కోరారు.

భూమి కేటాయించాలని వినతి

చింతపల్లి: మండల కేంద్రంలో సంత్ సేవాలాల్ ఆలయ నిర్మాణానికి భూమిని కేటాయించాలని గిరిజన సంఘం నాయకులు మంగళవారం తహసీల్దార్ విశాలాక్షికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచులు బాల్‌సింగ్, సుజాత, నిర్మల, దీప్లానాయక్, బంగారి జగన్‌నాయక్, మాజీ సర్పంచ్ బిచ్చానాయక్, బాలాజీ, రమేష్ పాల్గొన్నారు.